నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్సు సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, బీచ్‌కుండ్, జూకల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికులు నేరుగా డీఎంతో మాట్లాడవచ్చన్నారు. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే బస్సుల గురించి ఎలాంటి సమస్యలుంటే 9959226249 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

సిటీడిపోలో..

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపో నుంచి రాకపోకలు సాగించే బస్సులకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో 9959226137 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని మేనేజర్ టి.సమత తెలిపారు.

బండ్లగూడ డిపోలో..

నాగోలు: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనలు స్వీకరించేందుకు బండ్లగూడ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటలకు కొనసాగే కార్యక్రమంలో ఎలాంటి సందేహాలున్నా 9959224058 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ పాతబస్తీలోని శ్రీభవానీ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం ఆయన ఆలయ ముఖద్వార నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, శ్రీనివాస్, సదానందరెడ్డి, ఉమామహేశ్వర్, మల్లేష్‌గౌడ్, అంజిరెడ్డి, సత్తిరెడ్డి, రాజు, చందు పాల్గొన్నారు.

మామిడి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం



రైతులతో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వచ్చే మామిడి సీజన్‌లో మార్కెట్‌కు వచ్చే ప్రతి రైతుకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తామని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బాటసింగారం పండ్ల మార్కెట్‌కు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మామిడి రైతులు చైర్మన్‌ను కలిశారు. సీజన్‌లో వారు ఎదుర్కొనే సమస్యలపై చైర్మన్‌కు విన్నవించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిపై అవగాహన కల్పించాలి

నాగోలు: విద్యార్థి దశలోనే ప్రకృతిపై అవగాహన కల్పిస్తే భవిష్యత్ తరాలకు బాగుంటుందని కేరూబ్ సినిమా డైరెక్టర్ జీవన్, హీరో విహాన్ కార్తీక్ అన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడలోని ఇందు ఇంటర్నేషనల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన చిల్డ్రన్స్ డే కార్యక్రమంలో కేరూబ్ చిత్ర యూనిట్ పాల్గొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డైరెక్టర్ జీవన్ అన్నారు. విద్యార్థులందరికీ కేరూబ్ పేరుతో ప్రకృతిని కాపాడేలా పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సినిమా యూనిట్ దివ్య విశ్వకర్మ, కల్పలత, సుమన్ శెట్టి, దసరా గడ్డం సురేష్, శ్రీధర్ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నాగోలు: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోలులో గురువారం ఆయన అండర్–11, 13 సింగిల్స్ డబుల్స్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నారని క్రీడల్లో విద్యార్థులు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, ప్రభాకర్ భాస్కర్, వికాస్ హర్ష యాదవ్, రమేష్ పిల్లలమర్రి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి వంశీధర్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.

ధ్యానంతో జీవన ప్రమాణాలు పెంపు

మలక్‌పేట: ధ్యానంతో జీవన ప్రమాణాలను పెంపొందించుకోవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లో గురువారం నిర్వహించిన మలక్‌పేట బ్రహ్మకుమారీస్ ఇంద్రప్రస్థ భవన్ ప్రారంభోత్సవంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జస్టిస్ వి. ఈశ్వరయ్య, న్యూఢిల్లీ ఆర్‌టీసీ డైరెక్టర్ ఆశాదీదీ, బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ హైదరాబాద్ డైరెక్టర్ కులదీప్ దీదీ హాజరై మాట్లాడారు. శాంతి, సమాధానం కోసం ఆధ్యాత్మికం వైపు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ఇన్‌చార్జి డాక్టర్ ఉమారాణి, ఆయా జిల్లాలకు చెందిన దాదాపు 500 మంది బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యం



నాగోలు: కళాశాలకు వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోలు బండ్లగూడలో ఉంటున్న షేక్ షన్మిన్ (18) నగరంలోని షాదాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీ–టెక్ చదువుతుంది. బుధవారం కాలేజీకి వెళ్లిన షన్మిన్ రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేక పోవడంతో తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆధ్యాత్మిక ఆలయాలు..
చరిత్రకు ఆనవాళ్లు



- భక్తుల కోర్కెలు తీర్చే కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి
- నాటి లక్ష్మీపురమే నేటి కర్మన్‌ఘాట్
- కార్తీకమాసంలో కిక్కిరిస్తున్న దేవాలయాలు

చంపాపేట: నదులు, పుణ్యదేవాలయాలు, సర్వమానవ సౌభ్రాతృత్వం, మతసామరస్యాన్ని విశ్వమానవ ప్రేమను పంచి పెంచు పుడమి తల్లి కంఠాభరణాలు మన పుణ్యక్షేత్రాలు. దాదాపు 800 సంవత్సరాల చరిత్ర సంతరించుకొని 11వ శతాబ్దంలో కాకతీయ రెండో ప్రతాపరుద్రుడికి, 17వ శతాబ్దంలో ఔరంగజేబుకు ధ్యానాంజనేయ స్వామి సాక్షాత్కరించినట్లు చరిత్ర చెబుతోంది. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం చంపాపేటలోని స్వయంభు మూర్తిగా వెలిసిన కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి పుణ్యక్షేత్రంపై ప్రత్యేక కథనం.

ఆలయ చరిత్ర

క్రీ.శ 1143లో గోల్కొండ దుర్గమును నిర్మించిన కాకతీయ వంశస్థుడైన రెండవ ప్రతాపరుద్రుడు కొన్ని రోజులు గోల్కొండలోనే ఉండి రాజ్యపాలన వ్యవహారాలు చూస్తుండేవారు. ఆయనకు వేటాడడం ఇష్టం. ఒక రోజు దట్టమైన అడవులు ఉన్న అప్పటి చల్చిం (ప్రస్తుత హైదరాబాద్) ప్రాంతంలోని నాడు లక్ష్మీపురంగా పిలువబడుతున్న ప్రస్తుత కర్మన్‌ఘాట్ దట్టమైన అడవి ప్రాంతంగా ఉండేది. ఈ ప్రాంతానికి ఓ రోజు రుద్రదేవుడు వేటాడేందుకు వెళ్లాడు. అప్పుడు ఆయనకు ఆత్మారామ విగ్రహం, ధ్యానముద్రలో నిమగ్నమై ఉన్న ఆంజనేయ విగ్రహం కనిపించాయి. వెంటనే అక్కడే స్వామివారికి దేవాలయాన్ని నిర్మించాడు. ఆ దివ్యమైన శిలా ప్రతిమయే మనకు సకల కోర్కెలు తీర్చే కర్మన్‌ఘాట్ స్వయంభూ ధ్యానాంజనేయ స్వామి విగ్రహం.



కోనేరులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



పర్వదినాల్లో ప్రత్యేక పూజలు..

అన్ని పర్వదినాల్లో ధ్యానాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలను ఆలయ పాలక మండలి, వేలమంది భక్తుల సమక్షంలో ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో ఆకు పూజ, స్వామికి అప్పాలు, అష్టోత్రం, గోత్రనామాలు, సహస్రనామార్చనలు భక్తులు తమ పేరుమీదగా జరుపుకుంటారు. కార్తీక మాసాలల్లో పాటు శ్రీరామనవమి, ఉగాది, దేవీనవరాత్రులు, హనుమాన్ జయంతి వంటి పర్వదినాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు

మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం..



ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించటమే ఆలయ సిబ్బంది ప్రధాన లక్ష్యం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవటంలో వెనుకంజ వేసేదిలేదు. ఆలయాన్ని తీర్థస్థలంగా తీర్చిదిద్దటమే మా సంకల్పం. త్వరలో సుదూర ప్రాంతంలోని భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ స్వామివారి అర్జిత సేవలందించటంతో పాటు నిత్యాన్నదానం, భక్తులు ఆధ్యాత్మిక వాతావరణం లో సేద తీరేందుకు సదుపాయాలు కూడా కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

-లావణ్య, ఆలయ ఈఓ

దాతల సహకారంతో సౌకర్యాలు..



దాతలు, భక్తులు, ఆలయ ఈఓ, సిబ్బంది సహాయ సహకారాలతో ఆలయంలో సుమారు కోటిన్నర రూపాయలతో కోనేరు ఆధునీకరణ, వాహనాలు, భక్తులు సేదతీర్చేందుకు షెడ్డులు, ఆలయ ఆవరణలో టైల్స్, గ్రానైట్, మార్బల్ బండలు, నిత్యాన్నదానం, స్వామివారి ఊరేగింపు రథం, వ్రత పీట, మోడల్ వంటగది వంటి సౌకర్యాలు కల్పించాం.

- నల్లా రఘుమారెడ్డి, ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్

కొంగు బంగారం.. నాగలింగేశ్వర ఆలయం



శిథిలావస్థలో ఉన్న మెట్లబావి

మన్సూరాబాద్: భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం సహారాస్టేట్స్‌కాలనీలోని శ్రీలలితా నాగలింగేశ్వర స్వామి దేవాలయం. ఈ ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. పూర్వం ఈ ప్రదేశమంతా అటవీ ప్రాంతం కావడంతో దేవాలయం ఉన్న సంగతి తెలియరాలేదు. ద్రాక్షతోటల నడుమనున్న దిగువబావి నీటిలో స్వయంభూగా వెలిశాడు కనుక గంగను తన వెంటే పెట్టుకుని వెలిశాడని భక్తుల విశ్వాసం. సహారా సంస్థ ఈ స్థలాన్ని కనుగోలు చేసి గెటెడ్ కమ్యూనిటీగా నిర్మాణం చేపట్టడంతో దేవాలయం విశిష్టత వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి దేవాలయంలో నిత్య పూజలు జరుగుతున్నాయి. మహాశివరాత్రి, ఏకదశి, కార్తీక మాస ప్రత్యేక పూజలు మొదలు అన్ని పండుగ సమయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు చేపడుతారు. పర్వదినాల్లో భక్తులు బారులుతీరుతారు.



ప్రాచీన లలితా నాగలింగేశ్వరస్వామి

ప్రాచీన దేవాలయం

కాలనీలోని లలితా నాగలింగేశ్వరస్వామి దేవాలయం అతి ప్రాచీనమైంది. భక్తుల కోర్కెలను తీర్చే ఇలవేల్పు. భక్తుల సహకారంతో దేవాలయంలో పండుగలను ఘనంగా నిర్వహిస్తున్నాం. మహాశివరాత్రి, ఏకాదశి, గణపతి, దుర్గా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నాం. నిత్యం ప్రత్యేక పూజలు చేపడుతున్నాం. *-మేకల వెంకట్‌రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యుడు*



మెట్లబావిని అభివృద్ధి చేయాలి

స్వయంభూగా వెలిసిన శివాలయం పక్కనే శిథిలావస్థలో ఉన్న మెట్లబావిని అభివృద్ధి పరచాలి. నిత్యం పూజలు చేపడుతున్న పూజారులకు వేతనాలను కొన్ని ఆలయాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. మా కాలనీలోని ఆలయ పూజారులకు కూడా జీతాలు చెల్లించాలి. కాలనీవాసుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం. *-గంగదాసు కృష్ణారెడ్డి, దేవాలయ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి*



పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నిరసన ర్యాలీలో పాల్గొన్న కృష్ణయ్య

దిల్‌సుఖ్‌నగర్: కాంట్రాక్టర్ల బిల్లులు రూ. వేల కోట్లు చెల్లిస్తున్నారు..విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు వందల కోట్లు కూడా చెల్లించడం లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య అన్నారు. రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షులు జిల్లాపల్లి అంజి అధ్యక్షతన గురువారం ఆర్‌కేపురం డివిజన్ కొత్తపేటలో స్కాలర్‌షిప్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆర్. కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. గత మూడేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు లేవని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని వెంటనే స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్, రవీందర్, ఆనంద్, రామకృష్ణ, రవి, ఉదయ్, ఆనంతయ్య, మహేష్, నీల వెంకటేష్, రామదేవి, రమేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టుకు గుండెపోటు

- హెల్త్ ఇన్సూరెన్స్ లేక ఇబ్బందులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

చంచల్‌గూడ: ఓ దినపత్రిక సీనియర్ జర్నలిస్టుకు ఆదివారం గుండెపోటు రావడంతో హుటాహుటిన మలక్‌పేట యశోద ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన వైద్యులు మూడు బ్లాక్‌లు ఉన్నాయని స్టంట్ వేయడం లేదా బైపాస్ సర్జరీ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గానీ సంస్థ నుంచి గానీ హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడంతో గుండె ఆపరేషన్ తలకు మించిన భారంగా మారింది. గుండె ఆపరేషన్ కోసం రూ. 10 లక్షల అంచనా వేస్తున్నారు. చేతిలో డబ్బు లేకపోవడంతో ఆపరేషన్ చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి జర్నలిస్టు ప్రాణాలను కాపాడాలని కుటుంబ సభ్యులు, తోటి జర్నలిస్టులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య

హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ కుటుంబ సభ్యుల ఆందోళన



హస్తినాపురం: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేసి భర్త, అత్తమామలు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా దేవరకొండ కొండమల్లేపల్లి మండలం మంత్రియ తండాకు చెందిన రమావత్ ఉమాదేవి(26)కి రమావత్‌గోపితో 8 ఏళ్ల క్రితం వివాహం అయింది. ప్రస్తుతం వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి క్యాటరింగ్ పనిచేస్తూ ఇంజాపూర్ గ్రామ పరిధిలోని తుల్జాభవానినగర్‌కాలనీలో నివాసముంటున్నారు. అదనపు కట్నం కోసం తరుచూ ఉమాదేవిని భర్త గోపి, అత్త సాలీ, మామ పంత్య వేధించగా పలుమార్లు పెద్దమనుషులతో పంచాయతీ పెట్టి పరిష్కరించామని, గురువారం కూడా గొడవ జరగడంతో పెద్దమనుషులు ఇరువర్గాలను సముదాయించి పంపించినట్లు తెలిపారు. ఆ తర్వాత భర్త, అత్తమామలు ఉమాదేవిని హత్యచేసి ఫ్యాన్‌కు ఉరిపెట్టి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. గోపి, సాలీ, పంత్యను ఇక్కడికి రప్పించే వరకు శవాన్ని ఇక్కడి నుండి తరలించేది లేదని మృతురాలి కుటుంబ సభ్యులు భీష్మించి కూర్చున్నారు. సమాచారం అందుకున్న వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి ఆదేశాల మేరకు వివిధ ఠాణా ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు మృతురాలి బంధువులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని ఏసీపీ వెల్లడించారు.

రేపు బీజేపీ ఆధ్వర్యంలో ఒకరోజు నిద్ర

చైతన్యపురి: మూసీ బాధితులకు అండగా ఉండి వారికి భరోసా కల్పించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ఒక రోజు నిద్ర చేయనున్నట్లు చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా తెలిపారు. మూసీ ఒడ్డున ఉన్న ఫణిగిరికాలనీ, మారుతీనగర్‌లో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు కాలనీల్లో ఉంటామన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో ఒక రాత్రి నిద్ర దీక్ష చేయటం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల ఇళ్లు కూలగొడతామని భయాందోళనకు గురి చేస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేడుతున్నామన్నారు.

ఉత్సాహం.. బాలల దినోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: చింతలకుంటలోని నారాయణ విద్యా సంస్థలో గురువారం బాలల దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేశ్వరి దేవి మాట్లాడుతూ..విలువలతో కూడిన విద్యనభ్యసిస్తూ, వినయ విధేయతతో ఎదిగే బాల్యం ఉన్నత భవిత, ఉత్తమ సమాజానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమని ముఖ్య అతిథులుగా ఏజీఎం హేమాంబర్, ఆర్ఐ రవి ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పలువురి బైండోవర్

చైతన్యపురి: రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న సెక్స్ వర్కర్లు, ట్రాన్స్‌జెండర్స్‌లను సరూర్‌నగర్ పోలీసులు అదుపులో తీసుకుని బైండోవర్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్, వీఎంహోం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లేన్‌లో రాత్రి 11 తర్వాత అటువైపు వెళ్లే వారిని సైగలు చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు రావటంతో గురువారం రాత్రి పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇద్దరు సెక్స్ వర్కర్లు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్స్‌ను అదుపులోకి తసుకుని సరూర్‌నగర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

చైతన్యపురి పరిధిలో..

రాత్రి వేళల్లో రోడ్లపై తిరుగుతూ రాకపోకలు సాగిస్తున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్న 9 మంది మహిళలను బైండోవర్ చేసినట్లు చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని తహసీల్దార్ హెచ్చరిస్తూ వారి నుంచి ష్యూరిటీ తీసుకుని విడుదల చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ కృష్ణయ్య

మన్సూరాబాద్: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలోని రాజీవ్‌గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్‌తో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉంటుందన్నారు. చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినప్పుడు సత్ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఎస్ఐ ప్రసాద్, నాయకులు చింతల సురేందర్‌యాదవ్, కాలనీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని టీనగర్ నుంచి ఎల్లారెడ్డికాలనీ వరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎస్ఆర్ కాలనీ నుంచి అంజలీ రెసిడెన్సీ వరకు కొనసాగుతున్న డ్రైనేజీ పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. ఇళ్ల ముందున్న ర్యాంపులను తొలగిస్తే సీసీ రోడ్డు విశాలంగా నిర్మించవచ్చని కాలనీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, శ్రీనివాస్, గోవింద్‌రెడ్డి, కొలను రాజేందర్, దాసుగౌడ్, గంట్ల ఎల్లారెడ్డి, కడారి యాదగిరియాదవ్, పారంద సాయి పాల్గొన్నారు.

పార్కుల్లో మెరుగైన వసతులు కల్పిస్తాం

మలక్‌పేట: పార్కుల్లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. సునందరెడ్డి పేర్కొన్నారు. సౌత్‌జోన్ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బీ, మలక్‌పేట సర్కిల్ మేనేజర్ కిరణ్‌కుమార్‌తో కలిసి గురువారం ఆమె సలీంనగర్ శ్రీపురంకాలనీ స్వర్ణ చతుర్భుజి పార్కును సందర్శించి కాలనీవాసులతో సమావేశమై పార్కు సమస్యలపై ఆరా తీశారు. గ్రీనరీ, వాకింగ్ పాత్, టైల్స్, ఆటస్థలం, ఐలవ్ శ్రీపురం బోర్డు, చైన్ లింక్ ఫెన్సింగ్, కంపోస్ట్ పిట్, మొక్కలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. ఈ సందర్భంగా సునందరెడ్డి మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తీ ఆదేశాల మేరకు పార్కులను సందర్శించి ప్రతీ నెల కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేసి పార్కుల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత బొక్క మధుసూదన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి జీవీ రామారావు, సెక్రటరీ కొండల్‌రెడ్డి, మహిళా వింగ్ అధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న సునందరెడ్డి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365